క్లుప్తంగా

ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సచివాలయాల ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేసేలా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. మంగళవారం వారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా పీఎస్‌లు చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారుల నేరుగా ఇళ్లకు పథకాలు అందించేలా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను సమన్వయం చేయాల్సిన బాధ్యత పీఎస్‌లపై ఉందన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

కోడుమూరు రూరల్ : కోడుమూరు మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మంజుల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గాడిరూతమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు, ఆయా శాఖల మండల అధికారులు తమ తమ ప్రగతి నివేదికలతో తప్పక హాజరు కావాలని సూచించారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

కల్లూరు: మండలంలోని ఎ.గోకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత, ఎంపీపీ పాఠశాలలను, పట్టణ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఎంపీపీ పాఠశాలను మంగళవారం ఎంఈఓ శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులను, రిజిస్టర్లను, విద్యార్థుల హాజరు పట్టికలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం వడ్డించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

మార్పులు, చేర్పులకు అవకాశం

కల్లూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాలో అభ్యంతరాలపై ఈ నెల 18 వరకు మార్పులు, చేర్పులకు అవకాశం ఉటుందని ఎంపీడీఓ జీవీ రమణ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి 13న జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని 13 మంది ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు.

దుండగులను శిక్షించాలి

కర్నూలు (న్యూటౌన్): నంద్యాల పట్టణంలో రాజ్యాంగ రూపకర్త బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహం చేతిని తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడం దారుణమని ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

అంగన్‌వాడీ పిల్లలకు ఆటల వస్తువుల పంపిణీ



ఆట వస్తువులను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ పిల్లలకు ఆలట వస్తువులు పంపిణీ చేశారు. స్థానిక గ్రీన్‌కో ఆధ్వర్యంలో రూ.10 వేల విలువ చేసే ఆట వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శివమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరాజు, బీసీ రవికుమార్, వలంటీర్లు, కరుణాకర్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

19న 'యే షామ్ ఆప్ కే నామ్'

కర్నూలు కల్చరల్: ఆర్‌ఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు వివేకానంద సర్కిల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో యే షామ్ ఆప్ కే నామ్ పేరుతో సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, గాయని రాణి తెలిపారు.

మెరుగైన సేవలందించాలి

కర్నూలు(హాస్పిటల్): ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో గ్రామీణ ప్రజల ఆరోగ్యస్థితిగతులను తెలుసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. మంగళవారం ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో సామాజిక ఆరోగ్య అధికారుల మూడవ విడత శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీహెచ్‌వోలు ఈ శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకుని గ్రామస్థాయిలో మెరుగైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంయూ డాక్టర్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

భోగభాగ్యాలిచ్చే.. భోగేశ్వరుడు!

- దక్షిణకాశీగా వెలుగొందుతున్న క్షేత్రం
- భోగేశ్వరుని దర్శనం సర్వపాపహరణం
- ఈ నెల 17 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



పూజలందుకుంటున్న భోగేశ్వరుడు



భోగేశ్వరాలయం వ్యూ

గడివేముల: భక్తులకు భోగభాగ్యాలిచ్చే.. భోగేశ్వరుడు మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నారు. మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలోని ఎర్రకనుమ కొండల్లో వెలసిన దుర్గాభోగేశ్వరస్వామి దర్శనం భక్తులకు సర్వపాపహరణం అని ప్రతీతి. భోగభాగ్యాలు ఇచ్చే భోగేశ్వరుడిగా ప్రసిద్ధి. దక్షిణ కాశీగా పేరొందిని ఈ ఆలయం పూర్వం భోగోలు అనే గ్రామం ఉండటంతో ఈ క్షేత్రానికి భోగేశ్వరం అనే పేరు వచ్చింది. ఈ క్షేత్రంలోని కోనేరుకు ఎంతో మహిమ ఉందని భక్తుల నమ్మకం. ఈ మేరకు మహాశివరాత్రి సందర్భంగా ఉత్సవాలకు శ్రీ దుర్గాభోగేశ్వరాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి,చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 17 నుంచి నెల రోజుల పాటు ప్రతి సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ చెప్పారు. 17వ తేదీన గడిగరేవుల గ్రామంలో ఉత్సవమూర్తులకు వరప్రయాణం, 18న స్వామివారి ఆలయ ప్రవేశం, 19న నంది వాహనోత్సవం, స్వామివార్ల తిరుమంజనము, అభిషేకార్చనలు నైవేద్యాల సమర్పణ, స్వామివారి కల్యాణోత్సవం, 21న రథోత్సవం ఘనంగా జరుగనుంది. 22వ తేదీన నాకబలి, వసంతోత్సవంతో బ్రహోత్సవాలు ముగుస్తాయి. అదేవిధంగా స్వామి,అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నంద్యాల, నందికొట్కూరు ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సుల నడువనున్నారు. 18వ తేది రాత్రి దేవనర్తకి నాటకం, 19వ తేదీన నెల్లూరు బృందం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాశీరెడ్డినాయన, బ్రాహ్మణ, రెడ్డి, వీరశైవ, ఆర్యవైశ్య అన్నదాన సత్రాల్లో ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

ఆలయ చరిత్ర



ఆలయప్రాంగణంలో అన్నచెల్లెళ్ల విగ్రహాలు

దక్షిణ కాశీగా ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ క్షేత్రానికి ఎంతో చరిత్ర ఉంది. భోగోలు అనే గ్రామం ఉండటంతో ఈ క్షేత్రానికి భోగేశ్వరం అనే పేరు వచ్చిందని పెద్దల మాట. పూర్వం భోగేశ్వరం గ్రామంలో పేద దంపతులకు అబ్బాయి,అమ్మాయి సంతానం. ఈ పిల్లలు చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. సంతానంలేని దంపతులు చిన్నారులను వేర్వేరుగా చేరదీసి పెంచుకుంటుండేవారు. ఒకరికి ఒకరు తెలియని పరిస్థితులలో పెద్దవారైన వారిద్దరికి వివాహం చేశారని పురాణాల కథనం. పెళ్లైన భార్యభర్తలు పడకగదిలోకి వెళ్లే ప్రయత్నంలో అదే ఇంట్లో పడుకున్న లేగ దూడ తోకను వరుడు తొక్కుతాడు. అప్పుడు దూడ మనుషుల భాషలో అమ్మా... వాడు నాతోక తొక్కినాడే అని తన తల్లి(ఆవు)తో అనిందట. స్పందించిన లేగదూడ తల్లి... వీడు సొంత చెల్లినే వివాహం చేసుకున్నాడు... ముందు వెనుక చూసుకొడులే అనిందట. ఆ మాటలు విన్న వరుడు కలత చెంది తెలియక తప్పు చేశామని వేడుకున్నాడు. అప్పుడు ఆ ఆవు ... వికండ మహర్షి కుమారుడు ఋష్యశృంగ మహర్షి వద్దకు వెళ్లి శరణు వేడుకోమని సూచించినట్లు నానుడి. వారు ఋషి వద్దకు వెళ్లగా తలంబ్రాలు, పసుపుపచ్చని వస్త్రాలు ఇస్తాడు. బ్రహ్మముడితో అన్ని క్షేత్రాలలోని కొనేరులలో స్నానం చేయాలని... ఎక్కడైతే మీ పసుపుతో ఉన్న వస్త్రాలు తెల్లగా మారుతాయో... అప్పుడు పాపపరిహారం అవుతుందని ఋషి చెప్పినట్లు ప్రచారం ఉంది. ఆ మేరకు వారిద్దరూ అన్ని క్షేత్రాలు తిరితుగా పండు ముసలివారు అయ్యారు. చివరగా శ్రీదుర్గాభోగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని పంచామృత కోనేరులో స్నానం చేస్తారు. అప్పుడు వస్త్రాలు పసుపు వర్ణం పోయి తెల్లగా మారతాయి. అప్పుడు పాపవిముక్తి పొందారని పూర్వికుల కథనం. దీంతో పాటు కాశీలో తప్పా మరే క్షేత్రంలో లేని కాలభైరవుడు భోగేశ్వరంలో ఉన్నందున ఈ క్షేత్రం దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచింది.

భోగేశ్వరుడి దర్శించుకుంటే పాపాలు తొలగుతాయి



మహాశివరాత్రి సందర్భంగా భోగేశ్వరుడిని, అమ్మవారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయి. ఇరవై ఏళ్లుగా స్వామికివారికి విశేష సేవలు అందించి భక్తుల మన్ననలు పొందుతున్నాం. భోగేశ్వరుడిని దర్శించుకుని ప్రతి ఒక్కరూ స్వామివారి కృపకు పాత్రులు కావాలి. భక్తుల సౌకర్యార్థం స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు ఏర్పాట్లు చేశాం.

–శ్యాంసుందర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకులు, భోగేశ్వరం

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని వసతులు ఏర్పాట్లు చేస్తున్నాం. స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశాం. తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నాం.

–సునీల్‌కుమార్‌రెడ్డి,చైర్మన్,భోగేశ్వరాలయం

రైతు సంబరాలు

మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రస్థాయి బండలాగు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ నెల 19వ తేదీన నాలుగుపళ్లలోపు ఎద్దుల పోటీలు జరుగనున్నాయి. అలాగే 20వ తేదీన ఆరు పళ్ల వృషభాలకు బండలాగు పోటీలు జరగుతాయి. 20న ఆలయ ప్రాంగణంలో గుండు, సందా పందెలు ఏర్పాటు చేశారు.

వేలాలకు మంచి స్పందన

- నగరపాలక రెవెన్యూ విభాగానికి రూ.14.43 లక్షల ఆదాయం

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలోని మార్కెట్లు, సైకిల్ స్టాండ్లకు మంగళవారం స్థానిక కౌన్సిల్ హాలులో బహిరంగ వేలాలు నిర్వహించారు. వేలాల్లో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, రెవెన్యూ అధికారి జునీద్ పాల్గొన్నారు. పాత బస్టాండ్ కింగ్ మార్కెట్‌ను ఖండేరికి చెందిన జి.మహమ్మద్ ఖజీమ్ హుస్సేన్ అనే పాటదారుడు రూ.5 లక్షల 85 వేలకు, ఫిష్‌మార్కెట్‌ను కె.ప్రదీప్ రూ.1లక్షకు, నగరపాలక కార్యాలయంలోని సైకిల్ స్టాండ్‌ను బుధవార పేటకు చెందిన బంగి పద్మావతి రూ.90 వేలకు, కిడ్స్ వరల్డ్ సైకిల్ స్టాండ్ కోసం వై.రామ్‌చరణ్ రూ.3 లక్షల 50 వేలకు, షరాఫ్‌బజార్ సైకిల్ స్టాండ్‌ను కూడా వై.రామ్‌చరణ్ రూ. 3 లక్షల 80 వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది మార్కెట్ వేలాల ద్వారా నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగానికి రూ.14.43 లక్షల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, రాజు, సోహెయిల్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్వహణలో అశ్రద్ధ చూపొద్దు

కర్నూలు (అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల వసతి గృహాల నిర్వహణలో ఎలాంటి అశ్రద్ధ చూపకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజన వసతులు కల్పించాలని జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఎ.నాగేశ్వరరావు కోరారు. అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయనను మంగళవారం సాయంత్రం బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పాలేగార్ సత్యనారాయణ రాజు, అధ్యక్షులు పి.శ్రీనివాసులు తదితరులు కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని వసతి గృహాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా అన్ని హాస్టళ్లలో వంద శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు ఎం.శ్రీనివాసులు, విశ్వనాథ్‌రెడ్డి, మహాలక్ష్మి, గిరిజారెడ్డి తదితరులు ఉన్నారు.

ఎండోక్రైనాలజీ హెచ్‌ఓడీగా డాక్టర్ శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎండోక్రైనాలజీ విభాగం హెచ్‌ఓడీగా డాక్టర్ పి.శ్రీనివాసులు నియమితులయ్యారు. విశాఖపట్నం ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఆయన కర్నూలుకు బదిలీ అయ్యారు. ఇక్కడ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ జె.ఎ.వి.సుబ్రహ్మణ్యం వైజాగ్‌కు బదిలీ అయ్యారు. ఈయనతో పాటు న్యూరోసర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రహ్లాద గుంటూరు ప్రభుత్వాసుపత్రికి బదిలీ అయ్యారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



దుర్వేశి గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఓ హేమసుందర్‌రెడ్డి

గడివేముల:పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దుర్వేశి గ్రామంలో వరి పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ తక్కువ మోతాదులో మందులను వాడాలన్నారు. ప్రతి రైతు సస్యరక్షణ చర్యలు పాటించడంతో పాటు వ్యవసాయాధికారులు సూచనలు సలహాలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. చీడపీడ పురుగుల నివారణకు వాడాల్సిన మందుల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వీఏఏ, తదితరులు పాల్గొన్నారు.

19న గోదా సమేత రంగనాథ స్వామి శోభాయాత్ర

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని మామిదాల పాడు వద్ద ఉన్న గోదాగోకులంలో శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం మార్చి 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు వెల్లడించారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మార్చి 1న దేశంలోని వివిధ సాధుసంతులు, జీయర్ స్వాములు, పీఠాధిపతుల సమక్షంలో ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందన్నారు. విగ్రహ ప్రతిష్ఠకు ముందు ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ నుంచి వివేకానంద సర్కిల్, మౌర్యా ఇన్, ఆర్‌ఎస్ రోడ్, నగర పాలక సంస్థ కార్యాలయం, ప్రకాష్ నగర్ మీదుగా గోదా గోకులానికి వివిధ కళా రూపాలు సాంస్కృతిక కార్యక్రమాలతో శోభాయాత్ర జరుగుతుందన్నారు. ఈ నెల 20న అంకురార్పణ, 21న శ్రీ విశ్వక్సేన ఇష్టి, 22న శ్రీసుదర్శన ఇష్టి, 23న శ్రీహయగ్రీవ ఇష్టి, 24న శ్రీలక్ష్మీనారాయణ ఇష్టి, 25న శ్రీనృసింహ ఇష్టి, 26న శ్రీవైభవేష్టి, 27న శ్రీవైనతేయ ఇష్టి, 28న శ్రీమన్నారాయణ ఇష్టి, జలాధివాసము, ధాన్యాధివాసము, శయ్యాధివాసము తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సమావేశంలో గోదా గోకులం సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, వేముల జనార్దన్, భూమా కృష్ణమోహన్, పెరుమాళ్ల బాలకృష్ణ, ఇల్లూరు రామయ్య, వేముల రవిప్రకాష్, పెరమాళ్ల బాల సుధాకర్, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, పాలాది వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): బాల్యవివాహాలను నివారించేందుకు తగిన దృష్టి సారించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి కె.ఎల్.ఆర్.కె.కుమారి సూచించారు. మంగళవారం ఆమె కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో సీడీపీఓలతో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయని, ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు పనులను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో సీడీపీఓలు అనురాధ, వరలక్ష్మి దేవి తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ అనంతయ్య

కోడుమూరు రూరల్ : పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు రెండు నెలల మాత్రమే ఉన్నందున ఈ సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ అనంతయ్య సూచించారు. మండలంలోని వర్కూరు హైస్కూల్‌ను మంగళవారం ఎంఈఓ అనంతయ్య తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మరింత రుచికరంగా వండాలని వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో ఎంఈఓ మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. పరీక్షల భయాన్ని వీడి ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని పాసవ్వాలన్నారు. గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో మెలకువలు తెలుసుకుని పాసయ్యేలా చదువుకోవాలని సూచించారు. తదనంతరం ఎంఈఓ హైస్కూల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించి గడువులోపు పూర్తి చేయాలని తెలిపారు.

18లోపు పంటల నమోదు చేయించుకోండి



కంబదహాల్‌లో వేరుశనగ పైరును పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులు రబీ సీజన్‌లో సాగుచేసుకున్న పంటలను ఈనెల 18లోపు ఈ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి, బ్యాతోలి, కంబదహాల్ గ్రామాలలో సాగు చేసిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులకు వేరుశనగ పంట సంరక్షణ పద్ధతులను సూచించారు.

మార్క్‌ఫెడ్ ద్వారా వేరుశనగ కొనుగోలు

గ్రామాలలో పంటల పరిశీలన అనంతరం బురాన్‌దొడ్డి, కంబదహాల్ గ్రామాల ఆర్బీకేలను ఏఓ తనిఖీ చేశారు. రికార్డులు, విత్తనాలు, మందులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. మార్క్‌ఫెడ్ ద్వారా వేరుశనగ దిగుబడులను కొనుగోలు చేస్తున్నామని, రైతులు ఆర్బీకేలలో వివరాలను రిజిస్టేషన్ చేయించుకోవాలని ఏఓ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మారెప్ప, శశిదేవి, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అప్పర్ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆపాలి



గుండ్రేవులలో ప్రాజెక్ట్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సి.బెళగల్: కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం తుంగభద్ర నది ఎగువ ప్రాంతంలో అక్రమంగా నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌ను వెంటనే ఆపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రాజెక్ట్‌ల పరిశీలన యాత్రలో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, రైతులతో కలిసి మండలంలోని తుంగభద్ర నదీతీర గ్రామమైన గుండ్రేవులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం చేట్టిన అక్రమ అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌తో రాయలసీమ ప్రాంతం తీవ్రంగా నష్ట పోతుందని, ప్రభుత్వం, రైతులు పోరాటాలు చేసి అప్పర్ అడ్డుకొవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం తోడ్పాటుకు చేపట్టిన ప్రాజెక్ట్‌ల నిర్మాణాలను త్వరిగతిన పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, నాయకులు ఓబులేష్, హరినాథరెడ్డి, జంగాల అజయ్‌కుమార్, ఈశ్వరయ్య, జగదీష్, రామాంజనేయులు, ఆవుల శేఖర్, నక్కి లెనిన్ బాబు, రంగనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత



కుటుంబ సభ్యులకు విరాళం అందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995 సంవత్సరం పదవ తరగతి చదివిన నజీర్ అనారోగ్యంతో (పక్షవాతం) ఇబ్బంది పడుతుండడంతో తోటి స్నేహితులు చేయూతనిచ్చారు. ఈ మేరకు మంగళవారం నజీర్‌ను స్నేహితులు గోపిక్రిష్ణ, వేణు, విజయ్, చిన్నన్న, మల్లిఖార్జున, రాజు, శ్రీను, రఘు, కిషోర్, వెంకటేశ్వర్‌రెడ్డి, క్రిష్ణమూర్తి పరామర్శించారు. తమవంతుగా రూ.40వేలు ఆర్థిక సాయం చేశారు.

ఆరోగ్యంపై అవగాహన



బస్తిపాడులో సైక్లింగ్ చేస్తున్న విద్యార్థులు

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో మంగళవారం క్యాన్సర్ వ్యాధిపై ఏఎన్‌ఎంలు పద్మావతి, సాయి కుమారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల విద్యార్థులతో గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సైక్లింగ్‌తో కలిగే ప్రయోజనాలను ఏఎన్‌ఎంలు వివరించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు రాజమ్మ, సుజాత, లక్ష్మీదేవి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడి కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



మూలపెద్దమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మతల్లికి మంగళవారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు పూజారులు అమ్మవారికి పంచామృతాభిషేకం, సుగంధద్రవ్యాలతో అభిషేకం, కుంకుమార్చన నిర్వహించి పట్టుచీర, పూలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నూతన వధూవరులు ఎల్లమ్మతల్లి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. ఉద్యోగ ప్రాప్తి పొందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులతో కిటకిటలాడిన మూలపెద్దమ్మ ఆలయం

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్ద అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర విశేషపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఫ్యాక్షన్ గొడవలకు దూరంగా ఉండాలి

- ప్రశాంత వాతావరణంలో జీవించాలి
- దిశ డీఎస్పీ వెంకటరామయ్య



పల్లెనిద్రలో భాగంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న దిశ డీఎస్పీ వెంకటరామయ్య

కోడుమూరు రూరల్ : అనవసరమైన గొడవలకు వెళ్లి ఫ్యాక్షన్ హత్యల్లో ఇరుక్కోకుండా దూరంగా ఉండాలని దిశ డీఎస్పీ వెంకటరామయ్య సూచించారు. మంగళవారం రాత్రి కోడుమూరులోని బుడగజంగాల కాలనీలో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో దిశ డీఎస్పీ వెంకటరామయ్య, ఎస్‌ఐ విష్ణు నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ హత్యలు జరిగిన వాటికి సంబంధించిన మూలాల కోడుమూరులో బయట పడుతున్నాయని, షెల్టర్ జోన్‌గా ఉంటోందన్నారు. ప్రజలు అనవరసమైన విషయాలు, తగాదాలకు వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని సూచించారు. గొడవల మూలంఆ కేసుల్లో ఇరుక్కుని కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకోవద్దన్నారు. ఏవైనా సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలలి, లేనిపక్షంలో పోలీసుల దృష్టికి తీసుకొచ్చి న్యాయం కోరాలని చెప్పారు. ఎస్‌ఐ విష్ణునారాయణ మాట్లాడుతూ ఇటీవల లోన్‌యాప్‌లు, ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవ్వరైనా ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పరాదని సూచించారు.

దామోదరం సంజీవయ్య జయంతి



సంజీవయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రాముడు, అధికారులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో మంగళవారం దామోదర్ సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో సంజీవయ్య చిత్ర పటానికి ఎంపీడీఓ రాముడు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్థిక, సామాజిక సమానత్వానికి దామోదర్ సంజీవయ్య ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా ఎంపీడీఓ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, సూపరింటెండెంట్ పుల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ జయప్రకాష్, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్, ఉపాధి హామీ ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.